సౌకర్యాలు నిల్.. పన్నులు ఫుల్

- ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పెరిగిన పన్నులు
- నగర వాసులపై అదనంగా రూ.5 కోట్ల పెనుభారం

ఏలూరు (టూటౌన్): సౌకర్యాలు నిల్.. పన్నులు ఫుల్ అన్న చందంగా ఏలూరు నగరపాలక సంస్థ పని తీరు ఉందని నగర వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతీ ఏటా ఆస్తి పన్నులో 15 శాతం పన్ను పెంపుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ సాకుతో పన్నులైతే పెంచేస్తున్నారు..కానీ ఆ స్థాయిలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడం లేదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం 2024–25లో ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.32.31 కోట్లుగానూ, వాటర్‌టాక్స్ లక్ష్యం రూ.14.48 కోట్లుగానూ ఉంది. వాటర్ టాక్స్‌పై పెంపుదల లేకపోయినా ఆస్తి పన్నుపై 15 శాతం పెంపుదల చేయడంతో నగర వాసులపై సుమారు రూ.5 కోట్లు అదనపు భారం పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26 పడనుంది. ట్యాక్స్‌లను ఇబ్బడి ముబ్బడిగాపెంచుకుంటూ పోతున్న నగరపాలక సంస్థ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పన్నుల పెంపు ఇలా

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం జనాభా 3.70 లక్షల మంది వరకు ఉన్నారు. మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 79 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం వార్డు సచివాలయ సిబ్బందినే పన్నుల వసూళ్లలో ఎక్కువగా వినియోగిస్తున్నారు.



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

వీరిపైన రెవిన్యూ విభాగం అధికారులు, సిబ్బంది అజమాయిషీ చూస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సంలో పెరిగిన అదనపు పన్నులను కలిపి వసూలు చేయాల్సి ఉంది. దీంతో వార్డు సచివాలయ సిబ్బందిపై మరింత పెను భారం పడనుందని భావిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025–26లో ఆస్తి పన్నుపై 15 శాతం అదనంగా పెంపుదల చేయనున్నారు. దీంతో గత ఆర్థిక సంవత్సరం ఆస్థిపన్ను లక్ష్యమైన రూ.32.31 కోట్లకు అదనంగా సుమారు 5 కోట్లు మేరకు అదనపు పన్ను భారం పడనుంది. దీంతో పాటు వాటర్ ట్యాక్స్‌ను పెంపుదల చేయకపోవడం వల్ల బతికి పోయామని దాన్ని కూడా పెంచి ఉంటే పరిస్థితి మరింత దారుణంగా ఉండేదని వాపోతున్నారు.

సౌకర్యాల మాటేమిటి..?

పన్నులైతే ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటూ పోతున్నారు. మరి మౌలిక వసతులు, సౌకర్యాల మాటేమిటని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగరంలో 80 వరకు మురికి వాడలు ఉన్నాయి. వీటిలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పక్కా డ్రెయిన్లు ఉన్నా వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. నగరంలో ప్రధాన రహదారులు కాకుండా 50 డివిజన్‌ల పరిధిలో సుమారు 600 వరకు రహదారులు ఉన్నాయి. వాటి నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొత్తలో హడావుడిగా రోడ్లను ప్యాచ్ వర్కులు చేసి చేతులు దులిపేసుకున్నారు. రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు, తాగునీటి సరఫరా వంటి వాటికి కార్పొరేషన్ నిధులను ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పన్నుల భారం పెంచడం సరికాదు



ఏలూరు నగరపాలక సంస్థపరిధిలోని ప్రజలపై ఏటా ఆస్థిపన్నులపై అదనపు బారాలు మోపడం సరికాదు. నగరపాలకక సంస్థ ఆదాయాన్ని అయితే పెంచుకుంటుంది కానీ ఆ స్థాయిలో ప్రజలకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదు. అదనపు పన్నులు పేద, మధ్య తరగతిప్రజల ఆర్థిక పరిస్థితులపై ప్రభావాన్ని చూపుతున్నాయి.

– బి.సోమయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు, ఏలూరు

కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి



నగర వాసులకు కనీస సౌకర్యాలైన డ్రెయిన్లు, తాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు నిర్మాణం, పార్కుల నిర్వహణ వంటి వాటి పట్ల అధికారులు దృష్టి సారించాలి. పన్నుల భారం పెంచిన విధంగానే మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే నగర వాసుల్లో పన్నులు భారం పెద్దగా కనిపించదు. ఎలాంటి వసతులు, సౌకర్యాలు కల్పించకుండా పన్నులు పెంచడం సరికాదు. – జి.గోపీ, సీఐటీయూ నాయకుడు, ఏలూరు

పెంకుటిల్లుకు రూ.8 వేల కరెంట్ బిల్లు



ఈ నెల వచ్చిన కరెంటు బిల్లు

దెందులూరు: కూటమి ప్రభుత్వం సామాన్యుడు గుండెలదిరేలా ఓ పెంకుటింటికి నెల కరెంటు బిల్లును రూ. 8 వేలు పంపింది. బిల్లు చూసిన వినియోగదారుడు ఒక్కసారిగా బిత్తరపోయాడు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో సోమయ్య అనే విద్యుత్ వినియోగదారుడు ఇంటికి ఈ నెల రూ. 8 వేలు బిల్లు ఇచ్చారు. ఆ బిల్లు చూసి ఇంట్లో నివసిస్తున్న వినియోగదారుడి మనవడు కోడి చుక్కల నాగేషు ఏం చేయాలో తెలియక తలపట్టుకుని కూర్చున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని సామాన్య వినియోగదారుడు నెలకు ఎనిమిది వేల రూపాయలు కరెంట్ బిల్లు వస్తే ఎలా జీవించాలి? ఎలా బిల్లు కట్టాలి? అని బాధ్యత లేకుండా ఎలా బిల్లు ఇస్తారని గ్రామంలో ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ సిబ్బందిని అడిగితే తాము చేసేదేమీ లేదని రీడింగ్ చూసాము బిల్ వచ్చింది మీకు ఇచ్చామని సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. దెందులూరు మండలంలో ఉండ్రాజవరం గ్రామంలో రెండు నెలల కిందట షెడ్డు రూ.8 వేల రూపాయలు బిల్లు వచ్చిన సంఘటన అదే మాదిరిగా ఏలూరు రూరల్ మండలంలో జాలిపూడిలో కూడా ఇలాగే రావడం గమనార్హం. అధికారులు మీటర్ ను పరిశీలించి బిల్లు లోపాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి రథోత్సవం



అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్టా మహా కుంభాభిషేకాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి శ్రీ హయగ్రీవ హవనం అనంతరం నిత్య పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. సాయంత్రం శ్రీ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీవారికి అశ్వవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీవీపీ దీక్షిత్ స్వామి, కిళాంబి వెంకట పవన్ కృష్ణమాచార్యులు విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

మురళినాయక్ మృతిపై సంతాపం

ఏలూరు (టూటౌన్): దేశం కోసం తన ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా అర్పించిన ధీరుడు మురళి నాయక్ అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. భారత నియంత్రణ రేఖ వద్ద జరిగిన యుద్ధభూమి లో మురళి నాయక్ అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. మురళినాయక్ చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందని, నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మాధవి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): మాధవి ఆత్మహత్యకు కారకులైన గెద్దం సంతోష్ తల్లిదండ్రులు,మేనమామను కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) ఏలూరు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పి.హైమవతి, ఏ.శ్యామలరాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్ఆర్‌ఐ కాలేజీలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న పంపాల మాధవిని గెద్దం సంతోష్ ప్రేమించానని పెళ్లి చేసుకుంటానని చెప్పి నిరాకరించడంతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుని మరణించిందని పేర్కొన్నారు. ఈ ఆత్మహత్యకు కారకులైన గెద్దం సంతోష్ తల్లిదండ్రులు, మేనమామలను కఠినంగా శిక్షించాలని ఐద్వా డిమాండ్ చేస్తుందని వివరించారు. వీరి వెనక ఎంతటివారున్నా కఠినంగా శిక్షించాలని మాధవి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



దెందులూరు: చాటపర్రులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తాయని రిసోర్స్‌పర్సన్ కె.తరుణ్ అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఆదివారం 11వ రోజు సందడిగా, వినోదాత్మకంగా జరిగాయి. తొలుత విద్యార్థులతో చేత గ్రంథాలయ సిబ్బంది కథలు చదివించడం, కథల్లోని నీతిని వివరించడం, చదవడం మాకిష్టం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ కె.తరుణ్ విద్యార్థులకు భారతదేశ స్వాతంత్ర్య సమర యోధుల జీవిత విశేషాలపై జనరల్ నాలెడ్జ్, క్విజ్ పోటీలు, సైన్స్‌లోని ప్రాథమిక అంశాలు, సులభంగా వేద గణితం నేర్చుకోవడం ఎలా? అనే అంశంపై క్లుప్తంగా శిక్షణ అందించారు. అనంతరం రీసోర్స్‌పర్సన్ ఎస్.మహీధర్ విద్యార్థులకు మైండ్ మేమరీ గేమ్స్, సరదా ఆటలు ఆడించారు. ఈ శిక్షణ తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది బి.రమేష్, ఎండీ అస్లాం పాషా తదితరులు పాల్గొన్నారు.

చాటపర్రులో..

దెందులూరు: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చాటపర్రు గ్రంథాలయ అధికారి కే వాసుకి అన్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. పుస్తకాలు పత్రికలు ప్రతి విద్యార్థి ప్రతి వ్యక్తి జీవితంలో అభివృద్ధి స్థిరత్వానికి ప్రత్యేకగా నిలుస్తాయన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను వేసవి సెలవుల్లో సమయం వృధా కాకుండా గ్రంథాలయాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులతో పత్రికలు విజ్ఞాన పుస్తకాలు చదివించారు.

జాలిపూడిలో మేరీ మాత పండుగ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఫాదర్లు

దెందులూరు: దేవునిపై విశ్వాసం మానవుని జీవన విధానాన్ని మెరుగుపరుస్తుందని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో జాలిపూడి విచారణకర్త ఫాదర్ తోట అంతోని రాజు ఆధ్వర్యంలో ఆదివారం మేరీ మాత పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత మేరీ మాత ప్రతిమను గ్రామంలో అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జాలిపూడి ఆర్‌సీఎం చర్చిలో పీఠాధిపతి జయరావు ప్రత్యేక దివ్య పూజ బలి అర్పించారు. ఆర్‌సీఎం సంఘాన్ని అభినందించారు. వేడుకల్లో ఛాన్స్‌లర్ బాబు, జార్జి సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజ్ కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్, దెందులూరు విచారణకర్త ఫాదర్ అమ్మన్ రాజా, పెదపాడు విచారణకర్త ఫాదర్ ఫాదర్ పి.మిల్క్ ఇయర్, ఫాదర్ ఫ్రాన్సిస్ అసిస్సి పాల్గొన్నారు.

ప్రపంచ ప్రజలకు శాంతి, సమాధానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నూతన పోప్‌గా అమెరికాకు చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ నియామకంతో ప్రపంచ ప్రజలు శాంతి, సమాధానం దొరుకుతుందని ఏలూరు మేత్రాసన పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. రాబర్ట్ ప్రివోస్ట్ పోప్ గా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్మలగిరి పుణ్య క్షేత్ర అన్నదాన ట్రస్ట్ చైర్మన్ కళ్ళే నాగేశ్వరరావు ఆదివారం స్థానిక బిషప్ హౌస్‌లో బిషప్ పొలిమేర జయరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కనకదుర్గమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక బావిశెట్టివారి పేట శ్రీ కనకదుర్గాంబ అమ్మవారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, పుష్పయాగ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7.02 నిమిషాలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరుణ, శ్రీ కనక దుర్గాంబ అమ్మవారి అష్టోత్తర శతకలశ పంచామృత, ఫలరస అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి హారతి, మంత్రపుష్పాలు సమర్పించి, తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 6.11 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, అంకురార్పణ, ధ్వజారోహణ, అఖండ దీపారాధన నిర్వహించారు. అనంతరం దిక్పాలకబలి, అగ్నిస్థాపన, రాత్రి 8.15 గంటలకు దర్బారు సేవ నిర్వహించి మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు యడవల్లి శ్రీహరి శర్మ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిననాగేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఏఐటీయూసీలో చేరిన పంచాయతీ కార్మికులు



ఏఐటీయూసీలో చేరిన పంచాయతీ కార్మికులతో యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): స్థానిక స్ఫూర్తి భవన్లో ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నందు గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 150 మంది పంచాయతీ కార్మికులు చేరారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు కనీస వేతనాలు కూడా లేకుండా వెట్టి చాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా టెండర్ విధానం అమలు చేస్తున్నారని అన్నారు. టెండర్ విధానం రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కిషోర్ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ..అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే ఉన్నత స్థానాలు



విద్యార్థులను సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్య ద్వారానే ఉన్నత స్థానాలు సాధించవచ్చని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. నగరానికి చెందిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి సత్రం ఆధ్వర్యంలో ఇటీవల విడుదలైన వివిధ తరగతుల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ఆర్యవైశ్య విద్యార్థుకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. వివిధ తరగతుల్లో టాపర్లుగా నిలిచిన ఏడుగురు విద్యార్థులకు రూ. 5 వేలు చొప్పున నగదు పురస్కారంతో సత్కరించగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మరో 41 మందికి రూ. 2 వేలు, రూ. 1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నా రాజకీయంగా వెనుకబడే ఉన్నారన్నారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి సత్రం అధ్యక్షుడు దివ్వెల జయబాబు, ఎంటీపీ సత్యకుమార్, నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు, ద్వారకాతిరుమల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ట్రస్ట్ చైర్మన్ బొండాడ రామ్మోహన రావు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షుడు జయ్యవరపు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణ వేడుక శనివారం రాత్రి కమనీయంగా జరిగింది. దేవదాయ శాఖ ఆధీనంలోని ఆలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు వార్షిక కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. తొలుత గ్రామంలోని వినాయకుని గుడి వద్ద ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. మేళాతాళాల నడుమ స్వామి వారిని ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. స్వర్గీయ మొగ్గళ్ల బాబు, బంగారులక్ష్మీ, నాగేశ్వరావుల కుటుంబ సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు కుటుంబ సభ్యులు సహకారంతో ఈ వేడుక జరిగింది. నారాయణవనం కల్యాణమండపం వద్ద స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	54
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	38	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	22	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	09
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	03
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	01
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	03
ఏలూరు - బీహెచ్ఈఎల్ (ఖమ్మం)	20.00	98516	32
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.10	98503	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

వైభవంగా నరసింహ చతుర్థి పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇస్కాన్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో నరసింహ చతుర్దశి పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి గులాబీ పూలతో పుష్పాభిషేకం చేశారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసి స్వామివారి కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఇస్కాన్ ఏలూరు శాఖ నిర్వాహకులు రాధా వల్లభ దాస్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం

స్థానిక పడమర వీధిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఇన్‌చార్జుల ఏలుబడితో మమ

దెందులూరు: నియోజకవర్గ కేంద్రమైన దెందులూరు మండలంలో కీలకమైన ఏడు గ్రామాల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో గ్రామస్తులు రెవెన్యూ సేవలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైంది. ఈ శాఖలోనే ప్రధానమైన గ్రామాల్లో వీఆర్‌ఓ పోస్టులు నియామకం చేయకపోవడం గమనార్హం. గోపన్నపాలెం, పోతునూరు, కొవ్వలి, దెందులూరు, శ్రీరామవరం, జోగన్నపాలెం, చల్ల చింతలపూడి గ్రామాల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురవకుండా తహసీల్దార్ తాత్కాలికంగా ఇతర గ్రామాల వీఆర్‌ఓలను ఇన్‌చార్జులుగా నియమించారు. అయితే ఇన్‌చార్జులుగా నియమించిన వీఆర్‌ఓలకు ఈ అదనపు బాధ్యత తలపోటుగా తయారైంది. ఒక వీఆర్‌ఓ ఒక గ్రామం తో పాటు కచ్చితంగా ఒక శివారు కూడా ఉంటుంది. ఇప్పుడు ఇచ్చిన ఇన్‌చార్జి బాధ్యతలతో మూడు పంచాయతీలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏడు గ్రామాల్లో వీఆర్‌ఓలు ఇన్‌చార్జులు ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఉంటారో.. ఎప్పుడు వస్తారో ఆయా గ్రామాల ప్రజలకు తెలియని పరిస్థితి. దీంతో రెవెన్యూ సేవలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఏడు గ్రామాల్లో రెగ్యులర్ వీఆర్‌ఓలను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాలామృతం ప్యాకెట్లపై విచారణ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ఐసీడీఎస్ సెక్టార్ దిప్పకాయలపాడులోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి బాలామృతం ప్యాకెట్లపై విచారణ చేయాలని ఆదేశించినట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఆదివారం పేర్కొన్నారు. బాలామృతం ప్యాకెట్లు వేరే చోట్ల నిల్వ చేయడంతో గ్రామ కార్యదర్శిని విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.